


# వరసలు

భానుమతీ రామకృష్ణ

మొదట్లో మా పక్కింటాయన ఎవరో అనుకున్నాము. తీరా విచారిస్తే మావారికి మేనత్త, ఆడబడుచు, మేన మామగారి అల్లుడి, తమ్ముడి, కొడుకని తెలిసింది. బంధువులే గదా అని చూట్టానికి వెళ్ళాను. ఆవిణ్ని అంతకుముందు చూడలేదు. పెద్ద రుబ్బుడు పాత్రం లాగా వుంది. వెళ్ళగానే చాపవేసి కూర్చోబెట్టి – "బావేం చేస్తున్నారక్కాయ్ ?" అంది.

నేను వులిక్కిపడ్డాను. నా అభిప్రాయం తెలుసుకుందో, ఏమో మరి – "నువ్వు నాకు అక్కాయి వరసే" అంది. నేను నవ్వాలో ఏడవాలో తెలీని స్థితిలో 'అల్లాగా' అని మాత్రం అనగలిగాను.

"నువ్వు నాకింకా రెండు మూడు వరసలవుతావు." అంది మళ్ళీ నవ్వుతూ.

"ఏమేమి వరసలేమిటి ?" అన్నాను, ఇంతకంటే మంచి వరసలు ఏమైనా వున్నాయేమో పోనీ కొంత నయమని !

"నువ్వు ఏమవుతావో, తెలుసా ? ఇంకో వరసలో పెత్తల్లివి, ఇంకో వరసలో నాయనమ్మవి !" అంది.

దాంతో నా కళ్ళలో నీళ్ళు తిరిగినంత పనైంది ... ఏదో మొదటివరసే బాగుందనుకున్నా ...

"ఏదో అక్కా అనే పిలవండి" అన్నాను విధి లేనట్లు.

ఆవిడగారు పెద్దపెట్టున నవ్వుతూ, ''చూశావా, మరి నాకు తెలిసే అల్లా పిల్చా. అక్కా అంటేనే నీకు నాకు వరస బాగుంటుంది. ఏం ?" అంటూ నా బుగ్గ పొడిచింది. అంత లావు మనిషి ఆ విధంగా నాతో సరసం ఆడుతూంటే ఏంచేయాలో తోచక గుడ్లప్పచెప్పి కూర్చున్నా.

ఇంటికొచ్చాక కూడా ఆవిడ చెప్పిన వరసలు జ్ఞాపకం వచ్చినపుడంతా వాంతి వచ్చినట్లు అసహ్యంగా వుండేది ... అంత పెద్దమనిషి ... నలభై ఏళ్ళకు తక్కువ వుండవు ... ఆవిడకి నేను నాయనమ్మనా ? – అనుకొని ఏడుపు రాక, ఆముదం తాగినట్లు అయింది నా పని. ఈ విషయం ఈయన్తో చెప్తే కాని లాభంలేదని ఆవిడ చెప్పిన వరసల సంగతి చెప్పా. ఈయన నవ్వారు. నాకు ఏడుపొచ్చింది.

"దీంట్లో ఏం కొంప మునిగింది ? వరసకు అంటే ఏం భాగ్యం ? అన్నట్లు, నువ్వు నాకేమవుతావో తెలుసా ?" అన్నారు.

నేను తెల్లబోతూ "తె-లీ-దు" అన్నాను.

"ఒక వరసలో అక్కవి. ఇంకో వరసలో అత్తవి. మూడో వరసలో నాయనమ్మవే !" అన్నారు.

నిర్ఘాంతపోయి "ఎట్లాగా, ఇన్ని వరసలు ఎట్లా అవుతాను ?" అన్నాను. ఆయన నవ్వుతూ మన పక్కింటావిణ్నే అడుగు, తెలుస్తుంది !" అన్నారు. ఇదేమిట్రా భగవంతుడా, అనుకున్నా.

ఒకరోజు – మా పక్కింటావిడ ఇంటికెళ్ళా. ఆవిడ, ఆవిడ భర్త పెళ్ళికెళ్ళారట. ఆవిడ ముత్తవ్వ గారు దగ్గుతూ మంచంలో వుంది. ఆవిడ తన పక్కనే నన్ను కూర్చోమంది. వెళ్ళి, మంచంమీద ముసలమ్మ పక్కగా కూర్చున్నా – "ఏమే, తోడికోడలా, బాగున్నావా ?" అంది ఆమె. నే నదరిపడ్డా. ఈవిడ కూడా నన్ను ఎగతాళి చేస్తోందేమో అనుకుని – "అదేమిటి అవ్వగారూ ?" అన్నా.

ఆవిడ నవ్వుతూ "ఏమేవ్ ! నీకూ నేను అవ్వనయ్యానటే ? మనిద్దరం తోడికోడళ్ళ వరస తెలీదూ ? అక్కా అని పిలవాలి నన్ను నువ్వు. తెలిసిందా ?" అంది, నా చెయ్యి నొక్కుతూ.

రేపో, మాపో దావడానికి సిద్ధంగా వుండే ఆ తొంభై ఏళ్ళ ముసలమ్మ నాకు అక్క ... కాబోలు ! ఈ వరసలకి హద్దూ పద్దూ లేదు అనుకున్నా, నా దురదృష్టాన్ని తిట్టుకుంటూ. ఈయన చెప్పినమాట జ్ఞాపకం వచ్చింది. ముసలావిణ్ని అడిగితే ఆ వరసల సంగతి తెలుస్తుందిగదా అనుకున్నా. ఎలా అడగాలి అని ఆలోచించా. ఆయన చెప్పిన వరసలు మర్చిపోయా. 'ఆయనకు నేనేమవుతాను ?' అని అడిగేద్దామా – అనుకున్నా. ఛా. తెలివి తక్కువ ప్రశ్న ?

ముసలావిడే అందుకుంది. "ఏమిటే పిల్లా, ఆలోచిస్తున్నావ్ ?" అంది.

"ఏంలేదండీ" అన్నా.

"ఏమండీ – ఏమిటే పిల్లా మరీ చోద్యంగానూ. ఏమేవ్ అక్కా, ఒసేవ్ అక్కా – అని పిల్చుకోవాలి, తోడికోడళ్లు. మా ఇంట్లో ఈ 'ఏమండీలు' లేవు. ఏమే – ఒసే అనే పిల్చుకుంటాం" అంది.

అయ్యోం ఖర్మం అనుకొని ఆవిణ్ని, ఒసే అక్కా, అంటం ఎట్లాగా? – అని పీక నొక్కుకుంటూ కూర్చున్నా. మధ్య మధ్య ఆవిడ ద్రాక్షపళ్లు తన బోసినోటి చిగుళ్లతో నొక్కుతూ తింటూంది. నేనక్కడ ఆవిడ పక్కన కూర్చుని అవి చూస్తున్నంతసేపూ, నాకూ పళ్లూడిపోయినట్లు, నేనూ ద్రాక్షపళ్లు తింటున్నట్లు, నాకూ నలభై ఏళ్లూ వచ్చినట్లూ– ఏదో ఎక్కడో పరధ్యాన్నంగా వున్నా. ఆవిడ నా వీపు ఛడీల్న చరుస్తూ, "ఏమే చెల్లెలా, మా మరిదికి ఏం పని ?" అంది.

"ఏదో పనిట తెలీదు బాగా" అన్నా.

"పనిలేని పనా ? ఏవిటి ?" అంది నవ్వుతూ

ఆవిడ చమత్కారానికి నాకే నవ్వొచ్చింది. అవ్వతో సరసాలు జ్ఞాపకం వచ్చి నవ్వుకున్నా.

"మీ ఆయన నాకేమవుతాడో తెలుసా ?" అంది.

ఇదేదో కొత్తవరసలా వుందని భయంవేసింది.

"మరిది, అన్నారు కదూ, మీరు ?" అన్నాను నందేహిస్తూ.

ఆవిడ నవ్వుతూ "అది కాదే చెల్లెలా ! అతను నాకు ఇంకో వరసలో, అంటే మా పుట్టింటినుండి అత్తింటి వరసలో, ఆయన నాకు పెత్తండ్రి అవుతాడు. మా ఆడపడుచు ఇంటి వరసలో బావ – అవుతాడు" అంది.

అయ్యబాబోయ్ ! బావా? ఇంకో వరసలో ఏకంగా తండ్రే ! అంటే ఆవిడ నాకు కూతురి వరస ! ఆవిడకి తల్లిని నేను ! నా తల తిరిగినట్లయింది. ఈ వరసలకి ఓ అగ్గిపుల్ల అంటించాలనిపించింది. పైగా అంత ముసలమ్మ ఎంత బాగా జ్ఞాపకం వుంచుకుందీ వరసలు ? ఆవిడ జ్ఞాపకశక్తిని మెచ్చుకుంటూ, వరసల్ని తిట్టుకుంటూ, కొంపకొచ్చాను. ఇంకా ఆవిడ నన్ను, తోడికోడలా, బామ్మా – అని పిల్చినట్లే నా చెవుల్లో ధ్వనిస్తుండేది...మా అత్తగారొచ్చారు. ఆవిడగారితో నా మనసులో గొడవ వెళ్ళబోసుకుందామని జరిగిన వరసల విషయం, పక్కింటివాళ్ళ సంగతి చెప్పా ... ఆవిడ చెప్పుకొచ్చింది ...

"అయ్యో ! తల్లీ ! ఈ వరసలు యిల్లా తగలడ్డానికి కారణం– ఇంటిపేర్లు గోత్రాలూ సరిగా చూసుకోక, డబ్బుకోసం కక్కుర్తిపడి ఎవరి పిల్లని ఎవరికివ్వాలో తెలీక ఒక్కొక్క ఇంట్లోనే ఇరవై పెళ్ళిళ్ళు చేసేసుకున్నారు. అంచేత ఈ వరసలకి అర్థం లేకుండా పోయింది. అన్నట్టు నువ్వు నాకు ఏమవుతావో తెలుసా ?" అంది.

నా గుండె టకటక లాడింది. ఇంకే వరసలు ఈవిడికి వున్నాయిరా భగవంతుడా – అనుకున్నా.

"నీకు నేను మనవరాల్ని అవుతాను. ఇంకో వరసలో కోడల్ని !" అంది.

నోరు మూసుకున్నా. ఎట్లా అని కూడా అడగ బుద్ధెయ్యలా. మా అత్తగారి వంశవృక్షం ఇంచక్కా వుందా – అనుకున్నా.

పక్కింటావిడ పెళ్ళికెళ్ళి వచ్చింది.

"ఎవరి పెళ్ళికెళ్ళారు ?" అని అడిగా బుద్ధినేరక.

"మీ ముని మనవడి పెళ్లికెళ్లాం. మీ మనవరాలు బాగానే వుంటుందిలే. మొన్న అనుకున్నాం – మీరు రాలేదని ! మీ వారికి సెలవు దొరకలేదని నేను సర్దేశాలే. అన్నట్లు ఇది విన్నావా ? పెళ్లికొడుక్కి పెళ్లికూతురు అవ్వ అవుతుంది. పెళ్లికూతురికి పెళ్లికొడుకు తాత అవుతాడు. బాగుండ్లా ?'' అంది విరగబడి నవ్వుతూ. నాకు మతిపోయి నట్లయింది ! బాగానే వుంది మొత్తుకున్నట్లు అనుకున్నా. మా కుర్రాడు ఎవరికి తాతనో అనుకున్నా. వరసకి ఏమైనా కావచ్చుగా మరి !

ఖర్మంకాలి మేమిద్దరం వరసకన్నా, ఇంకోళ్ళకన్నా, చిన్నాళ్లం కాలేదు. తొంభయ్ ఏళ్ళ ముసలివాళ్ళకే మేము అవ్వ, తాతలం. ఈ విషయం మరీ రానురాను నా మనసులో కలవరం రేపింది. మా ఇంటికెవరైనా బంధువులు వచ్చారంటే అనవసరంగా వాళ్లదగ్గరికి పోయి "మీకు నేనేమౌతాను ?" అని అడిగేదాన్ని ... కనీసం వాళ్ల కూతురౌతాననో, కోడలవుతాననో చెబితే సంతోషిద్దామని. ఊఁహూఁ ! అల్లాంటి వరసలు నన్ను ఆదరించలా. నాకు ఈ వరసల విషయంలో చాదస్తం జాస్తీ అయినట్లు ఆయన తెలుసుకున్నారు. ఇంక రోజూ ఇంట్లో నన్ను 'ఏమేవ్ అవ్వా' అనీ, 'ఒసే ముసలమ్మా' అనీ పిలవడం మొదలెట్టారు. మొదట్లో దెబ్బలాడేదాన్ని ! అల్లా పిలవ్వద్దని. అలవాటయినకొద్దీ అది అంత కొత్తగా కనిపించేది కాదు. పైగా 'అవ్వా' అని ఆయన పిలవకపోతే బాగుండేదికాదు. కాని, పైవాళ్ళెవరన్నా ఈ వరసలు చెబితే కోపం వచ్చేది.

ఒకసారి బంధువుల పెళ్లికెళ్లాం. అది ఎవరి పెళ్ళో కాదు, చెప్తా వుండండి – మా అత్తగారి, ఆడబడుచు తోడికోడలు, సవితి, కూతురు, కొడుకు పెళ్లి – పెళ్లాం పెళ్లికి. బంధువులంతా వచ్చారు. నాకు భయంగానే వుంది. మళ్లీ ఏ ముసలమ్మో నన్ను అక్కా అంటూ తయారవుతుందేమో అని. పెళ్లి అయిన మర్నాడు మావారికి సెలవులేదని బయలుదేరాం. నేను పెట్టె సర్దుతూ వున్నా. బయట బండి ఆగి వుంది. బండి వేళయిందని తొందరచేస్తున్నారు. నా వెనకనుంచి ఎవరో "బామ్మా, ఈ రోజేనా వూరికి ప్రయాణం ! రెండు రోజులు వుండకూడదూ ?" అంది. మొదట ఎవర్నో అనుకున్నా. ఎందుకంటే, నన్నయితే నాయనమ్మ అని కానీ, అవ్వా అని కానీ, పిలవాలి. బామ్మా అంటుంది నన్ను కాదనుకున్నా. నా పక్కన కూర్చున్న ముసలామెను పిలుస్తోందేమో అనుకున్నా. తీరా ఆవిడ నా భుజం తడుతూ – "నిన్నే బామ్మా, పలకవేం ?" అంది.

"నన్నా ! ఆ అవ్వగార్ననుకున్నా," అన్నాను.

"నేనెవర్నో నీకు తెలుసుగా !" అంది ఆవిడ.

నిజంగా నాకు తెలీకపోయినా బుర్ర వూపాను.

"పెళ్లికూతురు నీకు మనవరాలి వరసా ?" అంది.

ఎన్నో మనవరాలో అనుకున్నా మనసులో. ఆవిడ తిరిగి వరసలన్నీ తిరగేస్తుందేమోనని భయంవేసింది.

"బండికి టైమయింది" అని తిరిగి పెట్టె సర్దబోయా. ఆవిడ నా చేతులు పట్టుకుని – "నీకు నేను కొత్తయితే నాకు నువ్వు పాతే. అన్నట్లు, నీ వొక్క బామ్మవే కాదు, నాకు. ఇంకా నీవు నాకేమవుతావో తెలుసా ?" అంది నోరంతా తెరిచి.

ఆవిడకి నమస్కారంచేస్తూ "క్షమించండి. మీకు నేనేమీ అవను. కావద్దు కూడా. ఈ వరసలు నాతో చెప్పకండి. నాకు తెలుసు, మీకు నేనేమవుతానో... అవ్వని...అవునా ?" అన్నా.

ఆవిడ తెల్లబోయి చూస్తూ ... "అవును" అంది.